క్లుప్తంగా

ఐటీఐ దరఖాస్తు గడువు పొడిగింపు

కాజీపేట : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 31 వరకు పొడిగించినట్లు జనగామ జిల్లా కన్వీనర్, కాజీపేట ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. www.iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలన్నారు. మొదటిసారి దరఖాస్తు చేసిన అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు మాత్రమే ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఏబీవీపీ కేయూ నూతన కమిటీ ఎన్నిక




అధ్యక్ష,కార్యదర్శులు హరికృష్ణ, జ్ఞానేశ్వర్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించిన ఏబీవీపీ సమావేశంలో బుధవారం కేయూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అధ్యక్షుడిగా ఉబ్బటి హరికృష్ణ, కార్యదర్శిగా మేకల జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షులుగా సాయికుమార్, రాజ్‌కుమార్, ఫణీంద్ర, వీరన్న, చరణ్‌గౌడ్, జాయింట్ సెక్రటరీలుగా శివంజి, రోహిత్, ప్రవీణ్‌కుమార్,హరికృష్ణ,ఉమేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, వరంగల్ విభాగ్ పృథ్వీరాజ్, యూనివర్సిటీ ఇన్‌చార్జ్ డాక్టర్ నిమ్మల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి డీటీగా రమేశ్

హన్మకొండ అర్బన్ : జిల్లాలోని ఎల్కతుర్తి మండల డిప్యూటీ తహసీల్దార్ (డీటీ)గా బొల్లు రమేశ్‌ను నియమిస్తూ హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకాలం పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో రమేశ్ పనిచేశారు. కాగా ప్రస్తుతం ఎల్కతుర్తి డీటీగా పనిచేస్తున్న భద్రునాయక్‌ను పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలోని రమేశ్ స్థానంలోకి బదిలీ చేశారు.

27, 28 తేదీల్లో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు

న్యూశాయంపేట : తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఈనెల 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు మొదటి దఫా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల నుంచి కొత్తగా జర్నలిస్టులుగా గుర్తింపు పొందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో జర్నలిస్టులుగా పనిచేస్తున్న వారికి ప్రాధాన్యతగా శిక్షణ ఇస్తారన్నారు. మొదటి దఫాలో 50 మందికి ఖమ్మం బైపాస్‌రోడ్డు ఉర్సు కరీమాబాద్ వద్ద ఉన్న తాళ్లపద్మావతి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్‌ల్లో శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న జర్నలిస్టులు ఈనెల 26లోగా తమ పేర్లను డీపీఆర్‌ఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఖిలా వరంగల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూఎస్పీసీ జిల్లా నేత అశోక్ కోరారు. బుధవారం తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావును ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) ప్రతినిధులతో కలిసి ఆయనకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో యూఎస్పీసీ నాయకులు గోవిందరావు, నామోజు శ్రీనివాస్, నరసింహారావు, రాజ్‌కుమార్,అశోక్, రాజేష్, ముజాహిద్ అలీ, సలార్ తదితరులు ఉన్నారు.

లాయర్లకు వైద్యశిబిరం

కాజీపేట అర్బన్ : మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో బుధవారం లాయర్లకు ఆరోగ్య అవగాహన సదస్సుతో పాటు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. హాస్పిటల్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ షఫీ, వీరిలు 2డీ ఎకో,ఈసీజీ, షుగర్, బీపీ తదితర పరీక్షలను నిర్వహించి చాతిలో నొప్పిపై అవగాహన కల్పించారు. శిబిరానికి ముఖ్యఅతిథిగా న్యాయమూర్తి సాయిశరత్ పాల్గొని హాస్పిటల్ వైద్య బృందం సేవలను అభినందించారు.

మీనాక్షి నటరాజన్ జన్మదిన వేడుకలు



కాజీపేట రూరల్ : కాజీపేట బాపూజీనగర్‌లో మాజీ ఎంపీ, పంచాయతీరాజ్ అభియాన్ సంఘటన్ మాజీ జాతీయ అధ్యక్షురాలు, ఏఐసీసీ రాజకీయ వ్యవహారాల తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు బుధవారం నిర్వహించారు. మీనాక్షి చిత్రపటం వద్ద నాయకులు కేక్ కట్ చేశారు. షేక్ అజ్గర్, పసునూరి మనోహర్, శ్రీకాంత్, హనుకాంత్, మానస మధు పాల్గొన్నారు.

గుంతలమయంగా రైల్వేస్టేషన్ రోడ్డు

- పలుచోట్ల ధ్వంసం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలో ఏర్పడిన గుంతలు

కాజీపేట రూరల్ : చౌరస్తా నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు, రైల్వే స్టేషన్ నుంచి కాజీపేట చౌరస్తాకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గాలు దెబ్బతిని గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డుపై నుంచి నిత్యం ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనదారులు వందల సంఖ్యలో రాకపోకలు చేస్తుంటారు. కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి బయటికి వెళ్తుండగా పాత రన్నింగ్ రూం ముందు కూడా రోడ్డు ధ్వంసమై గుంతలు పడి ప్రమాదకరంగా ఉంది. కాజీపేట జంక్షన్ ప్రాంగణంలో పలుచోట్ల రోడ్లలో వర్షం పడినప్పుడు వర్షం నీరు నిలవడంతో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంతలరోడ్డు మీదుగా ఆటోలు వెళ్లడంతో ఆటోలు, బైక్‌లు రిపేర్‌కు వస్తున్నాయని డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. అధికారులు గుంతల పడిన ప్రధాన రోడ్డు మార్గాల సమస్యలను పట్టించుకొని మరమ్మతు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



చౌరస్తా నుంచి కాజీపేట రైల్వేస్టేషన్ వెళ్లే రోడ్డు మార్గంలో ఏర్పడిన గుంతలు

రోడ్లను బాగుచేయాలి



రైల్వే స్టేషన్ ముందు రెండు ప్రధానరోడ్డు మార్గాలను అధికారులు పట్టించుకొని మరమ్మతు చేపట్టాలి. రోడ్డు గుంతలు పడడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. – బాబురావు, ప్రయాణికుడు

డీజిల్‌కాలనీ రైల్వే క్వార్టర్స్ పరిశీలన

కాజీపేట రూరల్ : కాజీపేట డీజిల్‌కాలనీ రైల్వే క్వార్టర్స్‌ను బుధవారం రైల్వే అధికారులు, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచీ నాయకులు సంయుక్తంగా పరిశీలించారు. డీజిల్ కాలనీ రైల్వేక్వార్టర్స్ దెబ్బతిన్నాయని, మంచినీటితో పాటు ఇతర సమస్యలపై ఇటీవల దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌లు జంక్షన్‌కు వచ్చినప్పుడు వినతిపత్రాలు సమర్పించినట్లు మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచీ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె.జానీమియా, పాక వేదప్రకాష్ తెలిపారు. దెబ్బతిన్న క్వార్టర్స్, రూఫ్ లీకేజీలు, బీటలు బారిన క్వార్టర్స్ గోడలు, దెబ్బతిన్న బాత్ రూమ్స్ డోర్స్‌లను పరిశీలించి కార్మికులతో మాట్లాడి వివరాలను నోట్ చేసుకున్నారని తెలిపారు. నోట్ చేసుకున్న సమస్యలను సికింద్రాబాద్ రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వారు తమతో చెప్పినట్లు నాయకులు తెలిపారు. రైల్వేక్వార్టర్స్ పరిశీలనలో రైల్వే ఐఓడబ్ల్యూ అనిల్, డీజిల్ బ్రాంచీ ట్రెజరర్ రాజేశ్వర్‌రావు, నాయకులు నరేశ్‌యాదవ్, రవికిరణ్, హేమంత్ పాల్గొన్నారు.



రైల్వే క్వార్టర్స్ సమస్యలను నోట్ చేసుకుంటున్న సిబ్బంది

బాలగంగాధర్ తిలక్ స్ఫూర్తిని కొనసాగిద్దాం



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న పూర్ణేందర్‌రెడ్డి

ఖిలా వరంగల్: భారత దేశంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో స్వాతంత్య్ర పోరాట స్ఫూర్తిని నింపిన బాలగంగాధర్ తిలక్ మహనీయుడని, ఆయన స్ఫూర్తిని కొనసాగిద్దామని కాంగ్రెస్ సీనియర్ నేత, తిలక్‌రోడ్డు డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు పూర్ణేందర్ రెడ్డి సూచించారు. బుధవారం వరంగల్ తిలక్‌రోడ్డు జంక్షన్‌లో ఆ కాలనీ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో తిలక్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన తిలక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూర్ణేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయ చైతన్యాన్ని మేల్కొల్పడంలో తిలక్ పాత్ర, సహకారం మరవలేనిదన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కుసుమ ఉమేష్, మిరియాల రాజేందర్, ఉప్పలయ్య, రామ రవీందర్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

వరంగల్ చౌరస్తా : వరంగల్ ఎల్‌బీనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో బాల గంగాధర్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పరమేశ్వర్, రఘునారెడ్డి, మురళి, నాగరాజు, రాఘవాచారి, సతీష్, ప్రభాకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వైద్య కళాశాలకు శరీరదానం



ఎంజీఎం : నగరంలోని పోచమ్మమైదాన్‌కు చెందిన అడ్డగుడి తేజోమూర్తి అనారోగ్యంతో మరణించగా వారి కుమార్తెలు వాసవి, జాహ్నవిలు సమాజహితం కోరి, వైద్య విద్యా నిమిత్తం తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కేఎంసీ సిబ్బందికి భౌతికదేహాన్ని అప్పగించారు. ఈ సందర్భంగా కెఎంసీ ప్రిన్సిపాల్ సంధ్య మాట్లాడుతూ శరీరదానంపై అందరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. మరణానంతరం శరీర దానం చేస్తే బావి వైద్యులకు వైద్య విద్య అధ్యయనానికి, శాస్త్ర పరిశోధన కోసం, సర్జరీని నేర్చుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. శరీరదానం చేసి కుటుంబసభ్యులకు ధన్యవాదాలు తెలిపి, సర్టిఫికెట్ అందజేశారు. మరణానంతరం నేత్ర, అవయవ, శరీరదానానికి తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్‌ను సంప్రదించాలని అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోన్‌రెడ్డి మల్లారెడ్డి తెలి పారు. వివరాలకు 87905 48706, 94901 33650 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి చేయూతనిస్తాం

వరంగల్ చౌరస్తా : పట్టణ ఆర్యవైశ్య సభ్యుల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తామని సంఘం నాయకుడు గట్టు మహేశ్‌బాబు తెలిపారు. బుధవారం వరంగల్ ఆర్‌ఎన్‌టీ రోడ్డులోని ఆర్యవైశ్య భవన్‌లో జరిగిన సమావేశంలో పూర్వపు కార్యవర్గం బాధ్యతలను ప్రధాన కార్యదర్శి మాదారపు రాజేశ్వర్‌రావు నూతన అడహక్ కమిటీ తరుపున మహేశ్‌బాబు పత్రాలను స్వీకరించారు. త్వరలో సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి, కొత్త కమిటీ పారదర్శకంగా ఎన్నుకోవాలని తీర్మానం చేశారు.

భక్తులకు అన్నదానం

కాజీపేట: 62వ డివిజన్ సోమిడి శివారులోని రేణుకా ఎల్లమ్మ తల్లి దేవాలయం ఆవరణలో బుధవారం భక్తులకు ఆలయ పాలకమండలి సభ్యులు మహాన్నదానం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బొల్లికొండ యాదగిరి ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారికి శాకంబరీ ఉత్సవాలు నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు శంకర్ శర్మ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు.


హిందీ భాషా నైపుణ్యాల మేళా



మేళాలో చార్టులు, చిత్రలేఖనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని లష్కర్‌బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం హిందీ భాషా నైపుణ్యాల మేళాను నిర్వహించారు. 6 నుంచి పదో తరగతి వరకు విద్యార్థినులు వివిధ రకాల టీఎల్ఎం కృత్యాలు చార్ట్‌ను రూపొందించి హిందీభాషలో వివరించారు. మేళాకు ముఖ్య అతిథిగా హనుమకొండ ఎంఈఓ నెహ్రూ నాయక్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థినులు హిందీభాషలో నైపుణ్యాలను అద్భుతంగా ప్రదర్శించారన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వెంకట్

న్యూశాయంపేట : తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం జిల్లా 2వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి గొడుగు వెంకట్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా అధ్యక్షుడు నిమ్మల విజేందర్ అధ్యక్షతన ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. నేడు (గురువారం) హనుమకొండ అలంకార్ జంక్షన్ టీఎన్‌జీఓస్ భవన్ వద్ద ఉదయం సభలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గయ్య, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

'శ్వేతార్క'లో ముగిసిన చండీహోమం

కాజీపేట: పట్టణంలో కొలువుదీరిన స్వయంభు శ్రీశ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో బుధవారం చైత్రమాసంలో వచ్చే మాస శివరాత్రిని పురస్కరించుకుని చండీహోమం ఘనంగా నిర్వహించారు. యాగశాల నిర్వాహకులు రోహిత్ ఉపాధ్యాయ ఆధ్వర్యంలో జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలని ఆకాంక్షిస్తూ చండీ హోమం నిర్వహించారు.భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాల వితరణతో పాటు అన్నపూర్ణ భవనంలో అన్నదానం చేశారు.

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

హన్మకొండ : భారీవర్షాల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్, హన్మకొండ సర్కిల్ ఎస్ ఈలు కె.గౌతం రెడ్డి, పి.మధుసూదన్‌రావు తెలి పారు. రాబోయే మూడు రోజులు అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు, ప్రజలు విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని వారు వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు సొంతంగా విద్యుత్‌కు సంబంధించిన పనులు ఎట్టి పరిస్థితిల్లో చేయకూడదని తెలిపారు. ప్రతీ వైర్‌లో కరెంట్ ప్రసారం అవుతుందన్న అవగాహనతో మెలగాలని అన్నారు. విద్యుత్ వైర్లు, లైన్లు, స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నట్లు గుర్తిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

రోడ్లను అభివృద్ధి చేయాలి

ఖిలా వరంగల్ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరంగల్ కరీమాబాద్ ప్రధాన రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. కార్పొరేటర్ మరుపల్లి రవి ఆదేశాల మేరకు బుధవారం వరంగల్ స్మార్ట్ సిటీ కన్సల్టెంట్ అధికారి ఆనంద్ లాల్‌సింగ్ ఉర్సు రోడ్డు, ఉర్సు చెరువు గణేష్ నిమజ్జనం కట్ట ప్లాట్‌ఫామ్‌ను పరిశీలించారు. ఉన్నతాధికారులకు వివరించి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని అధికారి హామీ ఇచ్చారని కార్పొరేటర్ రవి తెలిపారు. గౌతం, రమేష్, దినేష్, సర్వేశం, రవి, పాల్గొన్నారు.

అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

హసన్‌పర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని సిద్ధాపురంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. రజనీకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో 65వ డివిజన్ కార్పొరేటర్ దివ్యారాణి, మాజీ కార్పొరేటర్ రాజునాయక్, మాజీ సర్పంచ్ ఈశ్వరమ, మాజీ ఉపసర్పంచ్ రమేష్, నాయకులు నాగరాజు, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

- కేయూ క్రాస్ నుంచి విద్యార్థి సంఘాల బైక్‌ర్యాలీ
- విద్యాసంస్థల తరగతుల బహిష్కరణ



కేయూ క్రాస్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల బాధ్యులు



వరంగల్ చౌరస్తా : రాస్తారోకో చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఇచ్చిన విద్యా సంస్థల బంద్ విజయంతమైంది. బుధవారం కేయూ క్రాస్‌రోడ్డు నుంచి హనుమకొండ అశోక జంక్షన్ వరకు విద్యార్థి సంఘాల బాధ్యులు, కార్యకర్తలు బైక్‌ర్యాలీ నిర్వహించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల తరగతులు బహిష్కరించారు. అశోక్ జంక్షన్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శులు నర్సింహారావు, రాచకొండ రంజిత్, మర్రి మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, ఏఐఎస్‌బీ కన్వీనర్ రోహిత్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కన్వీనర్ మాస్ సావిత్రి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతున్నా విద్యారంగ సమస్యలను ఇంకా పరిష్కరించలేదన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల బాధ్యులు బీరెడ్డిజస్వంత్, భానుప్రసాద్, కుమార్, వేల్పుల చరణ్, జ్యోతి, వంశీకృష్ణ, వినయ్, అనిల్, సాయిహర్షిత్, పృథ్వీ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నాయకుల రాస్తారోకో

వరంగల్ చౌరస్తా : విద్యా రంగ సంస్థల సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ విజయవంతమైంది. వరంగల్ జిల్లా కేంద్రం ఆంధ్ర బాలిక కళాశాల ముందు బట్టల బజార్ రోడ్డుపై వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు లాదెళ్ల శరత్,యార ప్రశాంత్ రెడ్డి, రంజిత్, మోబిన్, మార్త నాగరాజ్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, సమీర్, రాజేష్, శివ , రాకేష్ ,సోను, అభిరామ్, నజీర్ ,ప్రశాంత్, ప్రభాకర్ , అజయ్, రంజిత్ ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వనమహోత్సవం



మొక్క నాటుతున్న పీటీసీ ప్రిన్సిపాల్ పూజ

ఖిలా వరంగల్: వరంగల్ 43వ డివిజన్ మామునూరు ఎస్సీ వాడలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మమతారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఈదురు అరుణ విక్టర్ ఆధ్వర్యంలో బుధవారం వనమహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీటీసీ అసిస్టెంట్ ప్రిన్సిపాల్ మన్నె భిక్షపతి, మాజీ సర్పంచ్ ఎర్ర విజయ్‌కుమార్, కలకోట్ల కుమారస్వామి, ఆర్ట్ టీచర్ కిరణ్‌కుమార్, కరుణశ్రీ, శ్రీదేవి, ఇల్లందుల పుష్ప, విద్యార్థులు పాల్గొన్నారు

వృక్షాలను రక్షించాలి

మామునూరు : వృక్షాలను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని, నాటిన ప్రతీ మొక్కను నీరు పోసి రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కమల్‌యాదవ్ సూచించారు. బుధవారం ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి కళాశాల ప్రాంగణంలో హర్యానా రాష్ట్రంలోని గురుగావ్‌కు చెందిన తపస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వా గ్దేవి ఎన్ఎస్ఎస్ యూనిట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫా ర్మకాగ్నిసి అండ్ ఫైటో కెమిస్ట్రీ సహకారంతో ప్రాజెక్ట్ అరణ్య పేరుతో రెండు లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా కమల్‌యాదవ్ హాజరై అధ్యాపకులు, బీఫార్మసీ, ఎంఫార్మసీ, డిఫార్మాలతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. అడవులు అంతరించిపోవడం వల్ల వాతావరణంలో కా లుష్యం విపరీతంగా పెరిగి తద్వారా మానవ సమాజానికి అంతుచిక్కని రోగాల బారిన పడుతున్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరా జు, చంద్రప్రకాశ్, ఆర్.శివకుమార్, టి.రవిచందర్, రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

26న బీసీ రిజర్వేషన్ల సాధనకు దీక్ష

హన్మకొండ చౌరస్తా: ఛత్రపతి సాహూ మహారాజ్ స్ఫూర్తితో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 26న బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద దీక్ష చేపడుతున్నట్లు తెలంగాణ బీసీ మహాసేన రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతికుమార్ తెలిపారు. కుమార్‌పల్లిలోని మహాసేన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో తొలిసారిగా 1902, జులై 26న బలహీన వర్గాలకు విద్యా, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన గొప్ప వ్యక్తి వ్యక్తి ఛత్రపతి సాహూమహారాజ్ అన్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించడం హర్షణీయమన్నారు. సమావేశంలో వీరస్వామి, సుధాకర్, రవి, రవీందర్, రాజు, వెంకటాచారి, సద్గుణ, చంద్రశేఖర్, అమరేందర్, గణేష్, సాయితేజ, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ మహాసేన రాష్ట్ర కన్వీనర్ క్రాంతికుమార్

కార్మిక సంక్షేమమే బీఎంఎస్ లక్ష్యం

- టీఆర్‌పీఈయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి మహేశ్

హన్మకొండ : కార్మిక సంక్షేమం, హక్కుల సాధన, రక్షణ భారతీయ మజ్దూర్ సంఘ్ లక్ష్యమని ఆ సంఘ్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ హనుమకొండ జిల్లా కార్యదర్శి కడెం మహేశ్ అన్నారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయం ఎదుట భారతీయ మజ్దూర్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ బీఎంఎస్ ఆవిర్భవించి 70 వసంతాలు పూర్తి చేసుకుని 71వ సంవత్సరంలోకి ప్రవేశించిందన్నారు. ఆవిర్భావం నుంచి కార్మికుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు పోతోందన్నారు. బీఎంఎస్ అనుబంధ యూనియన్‌గా తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. విద్యుత్ ఉద్యోగుల హక్కుల సాధన, కాపాడడంలో రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర నాయకుడు మహేందర్, టీఆర్‌పీఈయూ నాయకులు కె.సంగీత్, ఎస్. శ్రీనివాస్, కె.సాయి కృష్ణ, ఎ.రాజ్ కుమార్, సాంబమూర్తి, శ్రీహరి, నవీన్, రంగా రెడ్డి, మల్లయ్య, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.



హన్మకొండ : జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న మహేశ్

నిట్‌లో బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలు

కాజీపేట అర్బన్ : బీఎంఎస్ (భారతీయ మజ్దూర్ సంఘ్) ఆవిర్భావ వేడుకలు నిట్ వరంగల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. నిట్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు ముఖ్య అతిథిగా హాజరై బీఎంఎస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. బీఎంఎస్ భారతదేశంలోనే ఒక ప్రముఖ కార్మిక సంఘం, కార్మికుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి నిత్యం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం, యూనియన్ నాయకులు కరుణాకర్, మల్లేశం, ప్రమోద్, పాల్గొన్నారు.



కాజీపేట అర్బన్ : ఆవిర్భావ వేడుకలో పాల్గొన్న ధర్మారావు, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్

చాడ సరిత సేవలు మరువలేనివి



సరిత చిత్రపటం వద్ద నివాళులర్పి స్తున్న మాజీ మంత్రులు

వేలేరు: బీఆర్‌ఎస్ పార్టీకి మాజీ జెడ్పీటీసీ చాడ సరిత అందించిన సేవలు మరువలేనివని మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్ అన్నారు. చాడ సరిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న మాజీ మంత్రులు, బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం మల్లికుదుర్లలోని ఆమె నివాసానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, శంకర్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకుడు రాకేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.